నమస్తే తెలంగాణ
సిద్దిపేట

I హైదరాబాద్, బుధవారం 3 ఏప్రిల్ 2024 | SIDDIPET

సిద్దిపేట కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్, ప్రజాప్రతినిధులు

గజ్వేల్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

పంటలు ఎండుతుంటే పట్టదా..!

కూడవెల్లి వాగుకు నీటిని విడుదల చేయాలి

- 24గంటల్లో నీళ్లివ్వకుంటే మల్లన్నసాగర్‌ను ముట్టడిస్తాం
- రైతులను మోసంచేస్తున్న కాంగ్రెస్ సర్కారు
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- రాజకీయాలు మాని రైతులను కాపాడాలి..
- యాసంగి పంటలకు బోనస్ ఇవ్వాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- రైతుల సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం



సిద్దిపేట కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 2: పది వేల ఎకరాల్లో పంటలు ఎండుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని, కూడవెల్లి వాగులోకి తక్షణమే నీటిని విడుదల చేయాలని, లేకపోతే రైతులతో కలిసి మల్లన్నసాగర్‌ను ముట్టడిస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా రైతులను ఆదుకోవాలని, ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని, రూ.2 లక్షల పంట రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ మను చౌదరికి మంగళవారం ఆయన వినతిపత్రం అందజేశారు. హరీశ్‌రావు వెంట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం నీటి నిర్వహణలో వైఫల్యం, విద్యుత్ నిర్వహణలో లోపాల కారణంగా నేడు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు ఆవేదన చెందుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కరువు నివారించే ప్రయత్నాలు చేయకుండా, కరువును పెంచి రైతులను ఇబ్బందుల్లోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. నిద్ర పోతున్న ప్రభుత్వాన్ని తట్టి లేపాలని, రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు హరీశ్‌రావు తెలిపారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

రైతుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ పలు డిమాండ్లను పెడుతున్నదని హరీశ్‌రావు అన్నారు. వడగండ్ల వాన, నీళ్లు లేక పంటలు ఎండిపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు ఆర్థిక సహాయం తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. 100 రోజుల్లో అమలు చేస్తానని చెప్పిన హామీలను కాంగ్రెస్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంట రుణమాఫీ చేయమంటే మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఎన్నికల కోడ్ అని అబద్ధాలు చెబుతున్నాడని, 100 రోజులు నిండిన తరువాతనే ఎన్నికల కోడ్ వచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. అప్పులు తీర్చాలని బ్యాంక్ అధికారులు రైతులను వేధిస్తున్నారన్నారు. యాసంగిలో వచ్చే వడ్లకు, మక్కలకు వెంటనే బోనస్ ఇచ్చి కొనాలని ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఎకరాకు రూ.15 వేలు రైతుబంధు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు ఎకరానికి రూ.12 వేలు వెంటనే ఇవ్వాలన్నారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క మాట కూడా కాంగ్రెస్ నిలుపుకోలేదని.. అడుగడునా కాంగ్రెస్ పార్టీ రైతులకు అన్యాయం చేస్తున్నదన్నారు. ఇవన్నీ గొంతెమ్మ కోరికలు కాదని.. ఎన్నికల సమయంలో మీరు ఊరూరా తిరిగి చెప్పడమే కాకుండా 100 రోజుల్లో అమలు చేస్తామని బాండ్ పేపర్‌లు రాసిచ్చిన వాగ్దానాలే అని హరీశ్‌రావు అన్నారు. కొత్త పథకాలు ఏమో కానీ.. ఉన్న పథకాలను కూడా తీసేసే పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో నాణ్యమైన 24 గంటలు వచ్చేదని.. నేడు 14,15 గంటలు కూడా సరిగా రావడం లేదన్నారు. కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లతో రైతులపై ఆర్థిక భారం పడుతున్నదని హరీశ్‌రావు అన్నారు.

కూడవెల్లిలోకి నీటిని విడుదల చేయాలి

సిద్దిపేట జిల్లాలోని కూడవెల్లి వాగులోకి వెంటనే మల్లన్నసాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కూడవెల్లి వాగుకు రెండు వైపులా ఉన్న పంటలు ఎండిపోతున్నాయని, తక్షణమే నీటిని విడుదల చేయాలన్నారు. గజ్వేల్, మిరుదొడ్డి, దుబ్బాక మండలాల్లో పంటలు ఎండిపోతున్నాయని, ఐదారేండ్లుగా ఒక్క ఎకరా ఎండిపోకుండా నీళ్లు అందించామన్నారు. మల్లన్నసాగర్‌లో నీళ్లు ఉండి కూడా నీటిని విడుదల చేయడం లేదని ప్రభుత్వంపై హరీశ్‌రావు మండిపడ్డారు. పది వేల ఎకరాల్లో పంటలు ఎండుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుదన్నదని ధ్వజమెత్తారు. దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మంత్రుల దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకుపోయినా.. ప్రభుత్వంలో చలనం లేదన్నారు. 24 గంటల్లో కూడవెల్లి వాగుకు నీళ్లు విడుదల చేయకపోతే పెద్దఎత్తున రైతులను తీసుకెళ్లి మల్లన్నసాగర్‌ను ముట్టడిస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు. అవసరమైతే తామే గేట్లు ఎత్తి కూడవెల్లి వాగుకు నీళ్లు వదులుతామన్నారు. ఆ పరిస్థితి రాకముందే ప్రభుత్వం మొద్దునిద్ర వదిలి తక్షణమే కూడవెల్లి వాగులోకి నీళ్లు విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎక్కడా బోరు బండ్లు కనబడలేదని..క్రేన్‌లు కనబడలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతుల కష్టమంతా బోర్లలో పెట్టే పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు మాని.. రైతులను కాపాడాలని హరీశ్‌రావు హితవు పలికారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ కన్వీనర్ వంగ నాగిరెడ్డి, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రాజనర్సు, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సోమిరెడ్డి, శ్రీహరియాదవ్, పురేందర్, కిష్టారెడ్డి, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్,బీజేపీని
చిత్తుగా ఓడించాలి

అనేక హామీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- గజ్వేల్‌లో రూ.150కోట్ల అభివృద్ధి పనులు రద్దు చేసింది..
- గజ్వేల్ అంటే కేసీఆర్ అడ్డా, భారీ మెజార్టీ రావాలి..
- అనేక యజ్ఞాలు, హోమాలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే..
- పదేండ్లలో బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదు..
- అందరికీ సుపరిచితుడు వెంకట్రామిరెడ్డి
- కాంగ్రెస్ పాలనలో సంక్షేమ పథకాలు బంద్..
- మూడు నెలలుగా పాడిరైతులకు పాల బిల్లులు రావడం లేదు..
- గజ్వేల్‌లో బీఆర్ఎస్ సమావేశంలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

గజ్వేల్, ఏప్రిల్ 2: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు అనేక హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇప్పుడు హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్నదని, పదేండ్లలో తెలంగాణకు ఏమీ చేయని బీజేపీని ప్రజలు చిత్తుగా ఓడించాలని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం గజ్వేల్‌లోని శోభ గార్డెన్‌లో నిర్వహించిన మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గజ్వేల్ అంటే కేసీఆర్ అడ్డా అని, ఎంపీ ఎన్నికల్లో మరోసారి నిరూపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆరు నెలల్లో ఆరు పార్టీలు మారిన కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు, దుబ్బాక ఉప ఎన్నికల్లో ప్రజలకు అనేక హామీలిచ్చి ఒక్కటి అమలు చేయని బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. ఉన్నత విద్యావంతుడు, ప్రజలకు సేవ చేసేందుకు ముందుకొచ్చిన బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించుకోవాలన్నారు. ఆయన సొంత డబ్బులతో ఏర్పాటు చేయబోయే ట్రస్టు ద్వారా పేద పిల్లలకు మేలు జరుగుతుందన్నారు. గజ్వేల్‌కు ప్రతిష్ట తెచ్చిన కేసీఆర్‌ను గెలిపించుకొని రుణం తీర్చుకున్న విధంగానే, వెంకట్రామిరెడ్డిని ఎంపీగా గెలిపించుకోవాలన్నారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్‌రావుపై గ్రామాల్లో చర్చ పెట్టాలన్నారు. ఉద్యోగరీత్యా ప్రజలతో సంబంధాలు పెట్టుకుని రాత్రిబవళ్లు కష్టపడి అభివృద్ధికి కృషిచేసిన వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని క్యాడర్‌కు హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

రూ.150కోట్ల పనులు రద్దు చేసిన కాంగ్రెస్

గజ్వేల్ అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం చేసిన రూ.150కోట్ల నిధులను సీఎం రేవంత్‌రెడ్డి రద్దుచేసి ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకున్నాడని హరీశ్‌రావు ఆరోపించారు. మన నోట్లో మట్టికొట్టిన కాంగ్రెస్‌ని ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. గజ్వేల్ గౌరవాన్ని ఆకాశమంత ఎత్తు తీసుకెళ్లిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కష్టం వచ్చినప్పుడు పూర్తి అండగా ఉంటానని, భవిష్యత్ మనదే అన్నారు. కార్యకర్తలు, నాయకులు వివాదాలను పక్కనపెట్టి కష్టకాలంలో కేసీఆర్ ప్రతిష్ట కోసం పనిచేయాలని, సొంతపార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. నాలుగు నెలల్లోనే సంక్షేమ పథకాలను ఇవ్వలేని దుస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని, ఒక్క హామీ సరిగ్గా అమలు కావడం లేదన్నారు. ఆటోవాలాలు చనిపోతే ఆదుకోవడం లేదని, రేవంత్‌రెడ్డి మాటలతో సరిపెడుతున్నాడని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. బీజేపీ నిరుద్యోగులకు మోసం చేసిందని, అధికారంలోకి వస్తే నల్లధనం తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి రూ.15లక్షలు, ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి హామీ నిలబెట్టుకోలేదన్నారు. దవాఖానల్లో కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు అందడం లేదని, మూడు నెలలుగా పాడి రైతులకు పాల బిల్లులను ఇవ్వడం లేదని రైతులు తన దృష్టికి తెచ్చారని హరీశ్‌రావు తెలిపారు.

దేవుడు అందరివాడు...

దేవుడు అందరివాడని, తాను రోజు ఇంట్లో పూజ చేసుకుని హనుమాన్ చాలీసా చదివిన తర్వాతనే బయటకు వస్తానని హరీశ్‌రావు తెలిపారు. ప్రతి ఇంట్లో దేవుడిని పూజిస్తారని, మన కేసీఆర్ యాదాద్రి నిర్మాణం అద్భుతంగా చేశారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా యజ్ఞాలు, హోమాలు చేసింది మన కేసీఆరే అన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఎవరూ గుడికి వెళ్లినా దేవుడు అందరికీ ఒకేలా కనిపిస్తాడని, దేవుడికి రాజకీయాలు ఉండవన్నారు. గజ్వేల్ గడ్డ గురించి ప్రతిఒక్కరికీ చెప్పాలని, పులివెందులకు వైఎస్సార్, కుప్పం ప్రాంతానికి చంద్రబాబు ఎలాగో గజ్వేల్‌కు కేసీఆర్ అలాగే అని.. గజ్వేల్ కేసీఆర్ అడ్డా అని మరోసారి నిరూపించాలన్నారు. హరీశ్‌రావు మాట్లాడుతుండగా కరెంట్ పోవడంతో కార్యకర్తలు గొల్లుమంటూ నినాదాలు చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశంగౌడ్, జహంగీర్, మాదాసు శ్రీనివాస్, దేవీరవీందర్, ప్రభాకర్‌రెడ్డి, యాదగిరి, జుబేర్, కృష్ణారెడ్డి, రంగారెడ్డి, యాదవరెడ్డి, శేఖర్‌గౌడ్, మండలాల పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌దే బలం: ఎమ్మెల్సీ యాదవరెడ్డి

జిల్లాలో బీఆర్ఎస్ బలంగా ఉందని, ప్రతిపక్షాల పాచికపారదని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలన అట్టర్‌ఫ్లాప్ అన్నారు. వెంకట్రామిరెడ్డి సమర్థత కలిగిన నాయకుడని, గజ్వేల్‌తో మంచి సంబంధాలు ఉన్నాయన్నారు.

మాయమాటలు నమ్మొద్దు

ఎన్నికల సమయంలో చెప్పే మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, రఘునందన్‌రావు మాటలు నమ్మవద్దని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. మల్లన్నసాగర్ ప్రజలకు రెట్టింపు పరిహారం ఇప్పిస్తానని ఆయన మోసం చేశాడన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగెత్తారన్నారు. సమావేశానికి వచ్చిన నాలుగు వేల మంది తలుచుకుంటే గజ్వేల్‌లోనే లక్ష ఓట్ల మెజార్టీ వస్తదన్నారు. కేసీఆర్ కట్టించిన ప్రాజెక్టులో నీళ్లు కావాలంటే బీఆర్ఎస్ అభ్యర్థినే గెలిపించుకోవాలన్నారు. గజ్వేల్‌లో డిపాజిట్ రాని వ్యక్తు లు పెత్తనం చెలాయిస్తున్నారని విమర్శించారు.

సంక్షేమాభివృద్ధికి గేట్లు తెరవాలి

సంగారెడ్డి డీఆర్వోకు వినతిపత్రం అందజేసిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, నాయకులు

- రైతులకు పంట నష్టపరిహారం అందించాలి
- క్వింటాలు వరికి రూ.500 బోనస్ చెల్లించాలి
- రూ.2 లక్షల పంట రుణ మాఫీ వెంటనే చేయాలి
- డీఆర్వోకు ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి వినతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 2: అభివృద్ధి, సంక్షేమం గేట్లు తెరవాలని బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావుతో కలిసి సంగారెడ్డి కలెక్టరేట్‌లోని డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. క్వింటాలు వరికి రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదన్నారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా చిల్లర రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ అసమర్థపాలన కారణంగా రాష్ట్రంలో కరువు పరిస్థితుల ఏర్పడినట్లు తెలిపారు మ్యానిఫెస్టోలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ సక్రమంగా అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. రైతులకు రూ.2 లక్షల పంట రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యం బోనస్ వంటి పలు అంశాల ఊసేలేదన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎకరానికి రూ.25 వేల పంట నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. వరికి రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. బోనస్‌తోపాటు మిగతా పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు. కాంగ్రెస్ గేట్లు తెరవడం కాదని అభివృద్ధి, సంక్షేమానికి గేట్లు తెరవాలని హితవు పలికారు. కాంగ్రెస్ సర్కారు విధానాలు రైతులకు నష్టం కలిగించేలా ఉన్నాయని ఆరోపించారు. రైతుల సమస్యలను పట్టించుకోకపోతే 6వ తేదీన జిల్లాకేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు జైపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, విజయేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, పెరుమాండ్ల నర్సింహులు, కొండల్‌రెడ్డి, ప్రభాకర్, మోహన్‌రెడ్డి, విఠల్, పుల్లారెడ్డి, నర్సింగ్‌రావు, అజీమ్, పరశురాం, గోపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

రఘునందన్‌పై కేసు నమోదు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 2: మెదక్ లోక్‌సభకు పోటీచేస్తున్న బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుపై సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఐపీసీ 504 కింద సీఐ భాస్కర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మార్చి 27న మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిలపై రఘునందన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రఘునందన్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఫిర్యాదులో పేర్కొన్నారు. కోడ్ ఉల్లంఘనపై ఎన్నికల కమిషన్‌కు కూడా ఎమ్మెల్యే ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

గెలిపిస్తే మీకోసం పని చేస్తా: వెంకట్రామిరెడ్డి

ప్రతి కార్యకర్త గుండెల్లో కుటుంబ సభ్యుడిలా ఉంటానని, ప్రజా సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని వెంకట్రామిరెడ్డి అన్నారు. గెలిచిన వెంటనే ప్రతి నియోజకవర్గంలో రూ.2కోట్లతో ఫంక్షన్‌హాల్ నిర్మించి రూపాయికే శుభకార్యాలకు ఇస్తానన్నారు. తన కుటుంబ సభ్యుల సహకారంతో రూ.100కోట్లతో పేద విద్యార్థులు, యువతకు నైపుణ్యశిక్షణ, ఉచిత పోటీ పరీక్షలపై శిక్షణ ఇప్పిస్తానన్నారు. సేవా కార్యక్రమాలు చేపడతానని హామీనిచ్చారు. మెదక్ పార్లమెంట్‌పై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తిగా ఢిల్లీలో సమస్యలపై గళం విప్పుతానన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ ఆశీర్వాదం, సహకారంతోనే పోటీచేస్తున్నట్లు తెలిపారు.

భారీ మెజార్టీ అందించాలి: రోజాశర్మ

వెంకట్రామిరెడ్డికి భారీ మెజార్టీ వచ్చేలా క్యాడర్ పనిచేయాలని జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ పిలుపునిచ్చారు. జిల్లాలో పార్టీ ఎంతో పటిష్టంగా ఉందని, ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేస్తే తప్పకుండా ఘనవిజయం తథ్యమన్నారు. జిల్లాలో కలెక్టర్‌గా ఆయన సమర్థవంతంగా పనిచేశారని, ఆయనకు అందరితో పరిచయాలు ఉన్నాయన్నారు. గజ్వేల్‌లో భారీ మెజార్టీని అందించి, వెంకట్రామిరెడ్డిని ఎంపీగా గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ తెచ్చిన కరువు ఇది

క్వింటాలు ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలి

- ఎండిన పంటలకు రూ.25వేల పరిహారం ఇవ్వాలి
- రూ.2 లక్షల వరకు పంటరుణాలు మాఫీ చేయాలి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్ గౌడ్
- మెదక్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

మెదక్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం క్వింటాల్ ధాన్యంపై రూ.500 బోనస్ ఇస్తే రైతులకు కొంత ఊరట లభిస్తుందని ఆమె తెలిపారు. ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రూ.500 బోనస్ ఇవ్వాలని, ఎండుతున్న పంటలకు రూ.25 వేల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్‌తో కలిసి పద్మాదేవేందర్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు పిలుపు మేరకు బోనస్ విషయంలో మెదక్ కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరు చూస్తుంటే ఈ సీజన్‌లో వరికి బోనస్ ఇవ్వడం అనుమానంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చాక అన్ని హామీ లు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్, గెద్దెనెక్కి వంద రోజులు పూర్తయినా అమలు చేయడం లేదన్నారు. కేసీఆర్ రైతు పక్షపాతి అని, వారి కోసం అనేక సంక్షేమ కార్యక్రమా లు అమలు చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు చేయూత లభించిందన్నారు. రైతులకు పెట్టుబడి సహాయం ఇవ్వాలని, నాణ్యమైన కరెంటు, సాగునీరు అందించాలని, పండించిన పంటకు బోనస్ ఇస్తూ గిట్టుబాటు ధర కల్పించాలని వారు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరించామని, కొన్న ధాన్యానికి సంబంధించి వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేశామని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కారుకు పరిపాలనపై అవగాహన లేదని, ప్లానింగ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి సాగునీటికి ఇబ్బంది లేకుండా చేశారన్నారు. 420 హామీలు ఇచ్చి 6 గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను విస్మరించిందని విమర్శించారు. వెంటనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు హరికృష్ణ, బీఆర్ఎస్ మెదక్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టి జగపతి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు సోములు, పాపన్నపేట, చిన్నశంకరంపేట మండలాల పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, రాజు, కొల్చారం, చిలిపిచెడు ఎంపీపీలు మంజుల కాశీనాథ్, వినోదా దుర్గారెడ్డి బీఆర్ఎస్ నాయకులు రాగి అశోక్, లింగారెడ్డి, బాగారెడ్డి, అంకం చంద్రకళ రవి, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, చిత్రంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలత, నాయకులు

విధులపై పూర్తి అవగాహన ఉండాలి

సంగారెడ్డిలో వీవీప్యాట్లు, ఈవీఎంల పనితీరును పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

- సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 2: ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల విధులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి సూచించారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో కొనసాగుతున్న పీహో, ఏపీహో, ఓపీవోల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ ఏజెంట్లకు సీక్రెసీ ఓటింగ్, పోలింగ్ నియమాలను వివరించాలన్నారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలని, మాక్ పోలింగ్‌లో 50కి తక్కువ కాకుండా ఓట్లు వేయాలన్నారు. ఫలితాలు తర్వాత ఈవీఎం యంత్రాన్ని క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. అనంతరం అసలైన పోలింగ్‌కు సన్నద్ధం కావాలన్నారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను పోలింగ్ కేంద్రాల్లో అమర్చడంపై అవగాహన ఉండాలన్నారు. హ్యాండ్ బుక్‌లోని